# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ తోనే స్వర్ణ ఆంధ్రప్రదేశ్ సాధ్యపడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ❖ కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం పూర్తి చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

- ❖ చార్టెడ్ అకౌంటెంట్‌లు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు.

- ❖ రైతులకు ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కె. అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27న ప్రసారమవుతుంది.

==========================

రాష్ట్రంలో ప్రతీ ఇల్లు, గ్రామం పరిశుభ్రంగా మారాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రోజు తిరుపతిలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర.. కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగిస్తూ... విరివిగా చెట్లు నాటి ఆహ్లాదకరమైన పరిసరాలను తీర్చిదిద్దాలన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ తోనే స్వర్ణ ఆంధ్రప్రదేశ్ సాధ్యపడుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంవత్సరం డిసెంబర్ నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్‌ని నిషేధిస్తామన్నారు. రాష్ట్ర సచివాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలను వినియోగించాలని ప్రజలకు ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతి నగరం భారతదేశానికే ఆదర్శంగా నిలవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రానికి 5 ర్యాంకులు వచ్చాయని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

==========================

కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందిస్తున్న నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం పూర్తి చేస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఈ రోజు గుంటూరు జిల్లాలో 2.88 కోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... రహదారులు గ్రామాభివృద్ధికి, రైతుల రవాణాకు, విద్యార్థుల భద్రతకు బలమైన మౌలిక వేదికలుగా నిలుస్తాయన్నారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను సమీక్షించి, తక్షణమే అంచనాలను సిద్ధం చేయడం జరిగిందని చెప్పారు. టెండర్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

==========================

చార్టెడ్ అకౌంటెంట్‌లు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈరోజు గుంటూరు జిల్లా బండ్లమూడి గార్డెన్స్ లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్  అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) గుంటూరు ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఏ విద్యార్థుల సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... వికసిత్ భారత్ లక్ష్యసాధనలో భాగంగా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్నది ప్రధానమంత్రి ఆకాంక్ష అని, దీనిలో 2.4 ట్రిలియన్ డాలర్లు సాధించాలన్నది ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్ ను వచ్చే జనవరిలో అమరావతిలో ఏర్పాటు అవుతుందని తెలిపారు. గతంలో జన్మభూమి, స్వయం సహాయక సంఘాలు, ఇ-గవర్నెన్స్, ఐటీ హబ్‌లతో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని, నేడు క్వాంటమ్ వ్యాలీతో రాష్ట్రం రూపురేఖలు మార్చబోతున్నారని చెప్పాను. ఐసిఎఐ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన, విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందిందని మంత్రి నారా లోకేష్ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

రైతులకు ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈరోజు శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ...  రైతు సేవా కేంద్రాల్లో తగినన్ని నిల్వలు ఉండేవిధంగా చూడాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. శివారు ప్రాంత రైతులకు సాగు నీరు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. అవసరమైతే తాత్కాలిక సిబ్బందిని నియమించి కలుపు మొక్కలను తొలగించాలన్నారు. చెరువుల్లో నీటి నిల్వలను పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

విరామం

==========================

విశాఖ బీచ్ రోడ్డు వేదికగా ఎన్.టి.ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియా రన్  కొద్ది సేపటి క్రితం ప్రారంభమైంది. తలసేమియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ఈ రన్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి, ఒలంపిక్ పతక విజేత కరణం మల్లేశ్వరి,  ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. ఎస్. తమన్ పాల్గొన్నారు. జన్యుపరంగా సంక్రమించే తలసేమియా వ్యాధిపై ప్రజలను చైతన్యం చేస్తూ.. 10, కిలోమీటర్లు, 3 కిలోమీటర్ల పరుగు నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి బీచ్ రోడ్డుకు చేరుకున్నారు.

==========================

రేపు ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న అధ్యాపకుల నియామక పరీక్షల నిర్వహణకు పూర్తిస్థాయిలో  ఏర్పాట్లు చేశామని చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ తెలిపారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో పరీక్షల ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ... ఈ పరీక్షలు జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్ ఉద్యోగాలను భర్తీ చేయడానికి ఆన్‌లైన్ విధానంలో ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోందని, దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.

==========================

ఆంధ్రప్రదేశ్ ను అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ రోజు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజక వర్గంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి... సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాలం అశోక్ తో కలిసి  నియోజక వర్గంలో మత్స్యకార గ్రామాలకు వెళ్ళి అక్కడ సుపరిపాలన తొలి అడుగు సభల్లో మాట్లాడారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 25వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

==========================

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలలో ఉన్న ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి తెలియజేస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

==========================
==========================